తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## హంసవాహనంపై పద్మావతిదేవి విహారం



తిరుచానూరు, నవంబర్ 21 ప్రభాతవార్త: శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండ రోజైన సోమవారం రాత్రి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో తిరుమాడవీధుల్లో ఊరేగారు. పట్టు పీతాంబర, వజ్ర వైడూర్య, విశేష ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన అమ్మవారు..రాత్రి 7 గంటలకు గజ, అశ్వ, వృషభాలు ముందు నడవగా, మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, చెక్కభ జనలు, కోలాటాలు, కర్పూర నీరాజనాలు అందుకుని భక్తులను కటాక్షించారు.

## స్పందనకు అర్జీల వెల్లువ



చిత్తూరు, నవంబర్ 21 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ హరినారాయణన్ నిర్వహించిన స్పందన కార్యక్రమంకు జిల్లా నలుమూలల నుండి 141 మంది ప్రజలు హాజరై సమస్యలపై కలెక్టర్, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజలు సమస్యలపై అందించిన వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్ సత్వరం సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 96, సర్వే శాఖ 9, హౌసింగ్ 8, సంక్షేమ శాఖలు 3, పంచాయతీరాజ్ 6, పోలీసు 4, ఇతర శాఖలకు సంబంధించి 15 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు.

## పురిటినొప్పుల మహిళకు
# ప్రసూతి ఆస్పత్రిలో నిరాదరణ !
### -ప్రాంగణంలోనే పండంటి బిడ్డకు ప్రసవం



తిరుపతినగరం, నవంబర్ 21ప్రభాతవార్త: ఆమె ఊరు తెలియదు....పేరు చెప్పుకోలేని పరిస్థితిలో నిండుగర్భిణిగా పురిటినొప్పులతో ప్రసవవేదనతో వచ్చిన యువతిని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యం చేశారు. ఆమెతో సహాయకులు లేరనే సాకుగా ఆస్పత్రిలో చేర్చుకునేందుకు నిరాకరించారు. ఉన్నఫళంగా యువతికి పురిటినొప్పులు రావడంతో ఆస్పత్రి ఆవరణలోనే ఉన్న తోటి మహిళలు దుప్పట్లు మరుగున డెలివరీ చేశారు. అయితే తోటి మహిళ వైద్యులు కూడా సానుభూతి, మానవత్వం మరచి ఇలా వ్యవహరించడం పట్ల వైద్యవర్గాలేగాక ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు, రాజకీయపార్టీలు విమర్శలు గుప్పించాయి. ఆ గర్భిణి మహిళ స్థానికురాలు కాదని, ఎక్కడ నుంచో వచ్చిన వలసకార్మికురాలుగా చెబుతున్నారు. అయితే తిరుపతి వంటి ఆరోగ్య, యాత్రాస్థలంలో ఇలాంటి సంఘటనలు వైద్యుల పనితీరును, నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తున్నాయి. తిరుపతి జిల్లా డిఎంహెచ్‌ఓ డాక్టర్ యు.శ్రీహరి కూడా సకాలంలో స్పందించి ఆస్పత్రి వర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఈ విషయం వెలుగుచూడటంతో తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జి సుగుణమ్మ ఆస్పత్రికి చేరుకుని బాధిత మహిళను పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

# దారితప్పిన బోటు

### పులికాట్ సరస్సులో 50 మందికి తప్పిన ప్రమాదం
### అందులో 30 మంది బడిపిల్లలు
### సోమవారం మధ్యాహ్నం గంటసేపు హాహాకారాలు



పులికాట్ సరస్సులో గాలివానలో చిక్కుకున్న బోటు

తడ, నవంబర్ 21 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దుల్లో సోమవారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా తడ మండలానికి చెందిన 50 మంది ప్రయాణికులు, బడిపిల్లలు పులికాట్ సరస్సులో దారితప్పారు. తుపాను వాతావరణ హెచ్చరికలు ఉన్నప్పటికీ తమ బతుకు కోసం, బడి కోసం దీవిని దాటుకొని గట్టుకు వచ్చి తిరిగి వెళ్లే సమయంలో వీరు ప్రమాదంలో చిక్కుకున్నారు. భారీవర్షం కురవకపోయినా ఈదురుగాలులు, చలిగాలుల మధ్య పడవ ప్రయాణం ప్రమాదకరమే అయినా, అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసినా వారికి అంతకన్నా దిక్కులేదు. తడ మండలం భీములవారిపాలెం నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు ఇరకం దీవిలోని తిరు వెంకటనగర్ కుప్పానికి ప్యాసింజర్ బోటు పయనమైంది. అందులో ఆరంబాకం, బీవీపాలెంలలో చదువుకునే 30 మంది పిల్లలు, తడ, గుమ్మిడిపూడి ప్రాంతాల్లో చేపలు విక్రయిం చుకునేందుకు వచ్చి తిరిగి వెళుతున్న 20 మందికి పైగా మహిళలు ఉన్నారు. వీరితో పాటు కూరగాయలు, బియ్యం బస్తాల వంటివి ఈ పడవలో వేసి గాలిలోనే పయనమయ్యారు. బీవీపాలెం, ఇరకం దీవుల మధ్య 7 కిలోమీటర్ల దూరం ఉంటుంది. 45 నిమిషాల ప్రయాణం. అయితే సరస్సు మధ్యలోకి ఈ బోటు వెళ్లే సరికి బోటుకు సంబంధించిన ఫ్యాన్ ఊడిపోయినట్లు ప్రయాణికులు తెలిపారు. దీనితో ఈ బోటు దిశ మారింది. గాలి వేగం పెరగడంతో ఒక కిలోమీటరు దూరం పాటు గాలిలోనే కొట్టుకెళ్లిపోయింది. బోటులో ఉన్న వారు కాపాతుంగో.. కాపాతుంగో అంటూ తమిళంలో కాపాడండి.. కాపాడండి అని కేకలు పెట్టారు. పడవలోని వారు ఈ దృశ్యాలను వీడియో కూడా తీశారు. ఇరకం దీవికి టెలిఫోన్‌లో సమాచారం అందించి మరో బోటును రప్పించుకునే ప్రయత్నం చేశారు. బోటులో చిన్న పిల్లలు ఉన్న కారణంగా, ప్రస్తుతం పులికాట్ సరస్సు సముద్రంలాగా ఉధృతంగా ఉండ టంతో ఈ సంఘటన గురించి తెలుసుకున్న వారు భయపడ్డారు. ఎట్టకేలకు బోటు ఫ్యాన్‌ను పడవ సిబ్బంది సిద్ధం చేసి దిశను మళ్లీ మార్చుకొని తిరు వెంకటనగర్ పడవల రేవు వరకు తీసుకెళ్లడంతో అంతా ఊపిరిపీల్చు కున్నారు. ఈ వారం వ్యవధిలో ఇరకం దీవి వాసులు ప్రమాదంలో చిక్కుకో వడం ఇది రెండోసారి. ఇటీవల తమిళనాడులోని సున్నాంబుగోళం పాఠశాలకు వెళ్లి ఇరకం దీవి పిల్లలు వెనుతిరిగి వస్తుండగా బోటులో చిక్కుకుపోయారు. రాత్రిపూట మాత్రమే వారికి తిరిగి గట్టును చేరే అవకాశం లభించింది. ఇరకందీవిలోని తిరువెంకటనగర్‌లో బడి ఉన్నా, అందులో పాఠాలు చెప్పడానికి టీచర్లు ముం దుకు రావడం లేదు. డిప్యుటేషన్ల మీద అయ్యోర్లను పంపిస్తున్నామని అధికారులు చెప్తున్నప్పటికీ అది కార్యరూపం దాల్చడం లేదు. దీవికి రెండువైపులా సున్నాంబుగోళం, ఆరంబాకం, భీములవారిపాలెంలలో చదువుకుంటున్నారు. ఈ సంఘటనల తర్వాత అయినా ఉన్నతాధికారులు స్పందించి ఇరకం దీవి బాగోగులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.



పులికాట్ పోటులో ఇరకందీవికి చెందిన ప్రయాణికులు, పిల్లలు



## కాలినడకన తిరుమలకు ఆకేపాటి

తిరుమల, నవంబర్ 21ప్రభాతవార్తప్రతినిధి: వేలాదిమంది భక్తులతో ఆనవాయితీగా సోమవారం వైఎస్ఆర్ కడపజిల్లా జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కాలి నడ కన అన్నమయ్య కాలిబాటలో వచ్చి శ్రీనివాసుడిని దర్శించుకున్నారు.

## కాణిపాకంలో వైభవంగా కార్తీక దీపారాధన



కాణిపాకం, నవంబర్ 21 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో కార్తీకమాసం మొదటి సోమవారం కార్తీక దీపారాధన అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. కార్తీకమాసంలో ప్రతి సోమవారం శివాలయాలలో దీపాలను వెలిగించి మహిళలు మొక్కులు తీర్చుకుంటుంటారు. ఈమేరకు కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వరాలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకింద మహిళలు సోమవారం రోజున ఉదయం నుండి రాత్రి వరకు పెద్దఎత్తున దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాణిపాకం పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున దీపారాధన కోసం తరలిరావడంతో మణికంఠేశ్వరాలయం మహిళా భక్తుల రద్దీ నెలకొంది. ఇదిలా వుండగా ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# ఏనుగుల దాడులతో గ్రామాల్లో గజగజ





సదుం, నవంబరు21ప్రభాతవార్త మండల పరిధిలో గత వారం రోజుల్లో ఏనుగుల దాడులు పెరిగాయి. గత వారం మూడు చోట్ల దాడులు చేసి పంటలు నష్టం చేసివెళ్లాయి. ఇప్పుడు మళ్లీ ఆదివారం రాత్రి పోతుంవారిపల్లె, నాయనివారిపల్లె, ఉప్పరపల్లె, శీలయ్యగారిపల్లె, బత్తలవారిపల్లె తదితర గ్రామాలకు దగ్గరలోనే ఏనుగులు తిరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం పోతుంవారిపల్లె కు చెందిన రైతులు ప్రకాష్, రమేష్, గంగయ్యలకు చెందిన కోతకు వచ్చిన వరిపంటను ధ్వంసం చేశాయి. అదేవిధంగా మునస్వామి, భాస్కర, బత్తలవారిపల్లెకు చెందిన బాబురెడ్డిల మామిడి, కొబ్బరి చెట్లను విరిచేశాయి. పైపులను ధ్వంసం చేశాయి. దీనితో రైతులు లబోదిబోమంటున్నారు. శనివారం బాబురెడ్డి తోటలోనే ఏనుగులు ఉండటంతో ఆ మార్గంలో వెళ్లేందుకు రైతులు , పశువుల కాపరులు భయపడ్డారు. ఆదివారం రాత్రి పోతుంవారిపల్లెకు చెందిన రమేష్, సుబ్రమణ్యం, గణేష్, ఉప్పరపల్లెకు చెందిన రాజేంద్ర వరి, మామిడి తోటలను ధ్వంసంచేశాయి. అదేవిధంగా ఉప్పరపల్లెకు చెందిన మోహన్ చెరకుతోట, రాధాకృష్ణకు చెందిన వరిపంట ,పొలాల్లోని పైపులను ఏనుగులు నాశనం చేశాయి. గత వారం రోజులకు పైగా ఏనుగులు ఇక్కడే మకాం వేసి ఉండటంతో రాత్రి పూట ఎక్కడ దాడి చేస్తాయేనని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఏమి జరిగినా అటవీ సెక్షన్‌అధికారి బాబు ప్రసాద్ ఉండే వారని ఆయన బదిలీపై వెళ్లిపోయారని గ్రామస్థులు వాపోయారు. ఏమి జరిగినా వెంటనే ఆయన వచ్చి అందరిని అప్రమత్తం చేసేవారని ప్రస్తుతం రాంపల్లి బీట్‌కుచెందినఅదికారిని ఇన్‌చార్జిగా వేశారు కాని ఆయనకు ఆయన అటవీ ప్రాంతాలే సరిపోతున్నాయి. దీనితో ఇక్కడ తప్పకుండా అధికారిని నియమించాలని జోగివారిపల్లె సర్పంచి అనితకుమారి, చెరకువారిపల్లె వాటర్‌షెడ్ ఛైర్మెన్ జీవీరమణ గ్రామస్థులు కోరుతున్నారు.

## కార్తీక వెలుగులతో పుంగనూరు పుష్కరిణి

పుంగనూరు, నవంబరు 21 ప్రభాతవార్త :



కార్తీకమాస వెలుగు జిలుగులతో చారిత్రక పుంగనూరు పుష్కరిణి హొయలు పోయింది. ఈపుష్కరిణిలో కార్తీకమాసంలో జమీందారుల కాలంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించే వారు వారి పాలన అనంతరం రెండు దశాబ్దాలుగా ఏటా కార్తీకమా సంలో పట్టణ ప్రజలందరూ వచ్చి ఇక్కడ శివకేశవుల ప్రీతి కోసం దీపాలు వెలిగించి తమ జీవితాలలో వెలుగులు నింపాలని కోరుకోవడం పరిపాటి. కార్తీకమాసం చివరి సోమవారం రాత్రి హిందూ సంఘల అధ్వర్యంలో పుష్కరిణిలో నిర్వహించిన కార్తీక దీపోత్సవం కన్నుల పండుగగా సాగింది. వేలాది మహిళలు ప్రమిదలతో తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించడంతో కార్తీక సోమవారం రాత్రి పుష్కరిణి వెలుగుజిలుగులతో ఆధ్యాత్మిక దీపరూపమై వెలుగులుచిమ్మింది. ఎంపి ఎన్ రెడ్డెప్ప, రాష్ట్ర జానపద కళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి నాగభూషణం, పిఎంకే ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్, ఛైర్మన్ అలీంబాషా, ఎంపిపి అక్కిసాని భాస్కరరెడ్డిలతో పాటూ వైస్‌ఛైర్మన్‌లు నాగేంద్ర, లలితమ్మ, కమీషనర్ నర్సింహప్రసాద్, కౌన్సిలర్లు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.



# జిల్లాలో జగనన్న పాల వెల్లువకు శ్రీకారం

### -దేశంలోనే నాణ్యత పాలు అందించే రాష్ట్రంగా ఆంధ్రకు పేరుంది
### -తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతిరూరల్, నవంబర్ 21 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో జగనన్న పాల వెల్లువ పథకానికి శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మొదటి దశలో వంద గ్రామాలలో పాల సేకరణ లక్ష్యంగా నిర్ధేశించుకుని సోమవారం 79 గ్రామాలలో పాల వెల్లువ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో జె.సి., డి.సి.ఓ. అధికారులతో పాల సేకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ నారాయణ వనం, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో నేడు పాల సేకరణను 401 మహిళా రైతుల భాగస్వామ్యంతో 2435 లీటర్ల పాల సేకరణతో విజయవంతంగా ప్రారంభమైందన్నారు. మహిళా పాడి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ఏ.పి. ప్రభుత్వం పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య, అమూల్ సంస్థల మధ్య ఒప్పందం కుదుర్చుకుందన్నారు. గ్రామీణ మహిళా పాల ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుతో పాలకు పాగి రైతులకు గిట్టుబాటు ధర కల్పించామన్నారు. ఉమ్మడి జిల్లాలో 2020 జూలై 21న ప్రారంభించి పశ్చిమ ప్రాంతాలలో అమలు చేసి అంతర్జాతీయ స్థాయి సహకార డైరీగా పేరొందిన అమూల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెల్సిందే అన్నారు. జగనన్న పాల వెల్లువకు అత్యంత ఆదరణ కలగడం గుర్తించి తిరుపతి జిల్లాలో నేటి నుండి పాలక సేకరణ ప్రారంభించామని, పాల సేకరణ కేంద్రాలలో పూర్తిస్థాయిలో పరికరాల ఏర్పాటు జరిగిందన్నారు. అమూల్ సంస్థ పూర్తిగా రైతులకు సంబంధించిన కో-ఆఫరేటివ్ సొసైటీ అని, పాల సేకరణతో వచ్చే మొత్తాన్ని రైతులకు 85శాతం చెల్లించి, నిర్వహణకు 15శాతం ఉపయోగిస్తారని, 75 సంవత్సరాల చరిత్ర కలిగిన సంస్థ అమూల్ అన్నారు. జగనన్న పాల వెల్లువ నిర్వహణకు మహిళా పాడి రైతులే 8నుండి 11 మంది సభ్యులతో సొసైటీ ఏర్పాటు చేసుకుని సేకరణ ప్రారంభిస్తున్నారన్నారు. ప్రస్తుతం పోటీ పరీక్షలలో అధ్యయనం చేసిన మేరకు పాల నాణ్యత మేరకు ఒక లీటరుకు రూ.4. నుండి రూ.15 రుపాయాలు వరకు అదనపు ఆధాయం వస్తుందన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో సోమవారం నుండి పాల సేకరణ విజయవంతంగా సేకరిస్తున్నామని తెలిపారు. వడమాలపేట మండలం కాయం, నేపనూరు, కదిరి మంగళం ప్రాంతాలలో మహిళా పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో కిట కిట

శ్రీకాళహస్తి, నవంబర్ 21 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక మాసం చివరి సోమవారంగా బావిస్తున్నందువల్ల భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ఒక్క సోమవారమే సుమారు 50వేల మంది భక్తులు దర్శనం చేసుకొని ఉంటారని అంచనా. ఓ వైపు పొరుగు రాష్ట్రాల ప్రజలు మరో వైపు రాష్ట్ర నలుమూలల నుంచి మరో వైపు చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలి వచ్చిన జనంతో ఆలయం కిట కిట లాడింది. ఇక శివయ్య అభిషేక ప్రియుడంటారు. సోమవారం అంచనాలకు మించి అభిషేకాలతో పాటు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాల టిక్కెట్లు జారి చేసారు. క్యూలైన్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గేట్ల బీగాలు పాలకులు తమ జేబులో ఉంచుకోవటంతో అడ్డదారి దర్శనాలపై భక్తులు తిరుగుబాటు చేసారు. గేట్ల వద్ద సిబ్బందిపై తిరగబడ్డారు. ఓ దశలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముఖ్యంగా గేట్ల నిర్వహణలో అధికారులు దిశ దెశ నిర్ధేశం లేకపోవటంతో భక్తులు తీవ్ర ఇబ్బందికి గురౌతూ తిరుగుబాటు చేసారు.

### ఇన్ని అభిషేకాల టిక్కెట్లు జారి చేస్తే ఎలా?

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నాలుగు కాలాలలో అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ప్రస్తుతం ఆలయంలో లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన జరుగుతున్న తరుణంలో మూడవ కాలాభిషేకం దేవస్థానమే నిర్వహిస్తుంది. ఉదయం మొదటి కాలానికి 165 రెండవ కాలానికి 135 అభిషేక టిక్కెట్లు జారి చేసారు. గతంలో ఒక కాలం అభిషేకానికి కేవలం పది మందికి మాత్రమే టిక్కెట్లు జారి చేసే వారు. అభిషేకం అర్థగంట సేపు మాత్రమే నిర్వహిస్తారు. ఒక కాలానికి 165 టిక్కెట్లు అంటే ఒక టిక్కెట్‌పై ఇద్దరు అంటే 330 మంది దర్శనం చేసుకోవటం సాధ్యమా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇక సాయంత్రం అరుదుగా నిర్వహించే మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకానికి 129 టిక్కెట్లు జారి చేసారు. దర్శనం రెప్పపాటు కూడా లేదు. మధ్యలో దళారులు అడ్డదారుల్లో ప్రవేశంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

### అంచనాలకుమించి అభిషేకాలు:కట్టుబాట్లతో భక్తుల అసహనం



### గేట్లకు తాళాలు : భక్తుల తిరుగుబాటు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు పాలకులు అనాలోచిత నిర్ణయాలతో భక్తులు తిరగబడుతున్నారు. సోమవారం ఉదయం నుంచి ఇదే పరిస్థితి చోటు చేసుకుంది. ఇక్కడి ఆలయంలో లెక్కలేనన్నిగేట్లను ఏర్పాటు చేసారు. సోమవారం కార్తిక మాసం నాల్గవ సోమవారం కావటంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తారని ముందుగానే అధికారులకు తెలుసు. అయితే ఆదాయాలను పరిగణలోకి తీసుకునే పాలకులు భక్తుల బాధలను పట్టించుకోవటం లేదు. భక్తులను కట్టడి చేయటానికి విజయస్థంభం, 16 కాళ్ల మండపం వద్ద గేట్లు ఏర్పాటు చేసారు. ఇక్కడ నుంచే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకునే భక్తులు, అలాగే ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు ప్రవేశిస్తారు. అయితే సోమవారం పాలకులు కట్టడి చేయటానికి గేట్ల బీగాలు తమ వద్ద ఉంచుకున్నారు. అయితే ఉదయం 11 గంటల సమయంలో ఆలయంలో రద్దీ పెచ్చు పెరిగింది. ఓ వైపు గేట్ల బీగాలను పాలకులు తమ వద్ద ఉంచుకోగా అద్దాల మండపం వద్ద ఏర్పాటు చేసిన బయటకు వచ్చే గేటు నుంచి కొందరు పిఆర్ఓ కార్యాలయం సిబ్బంది, దళారులు అడ్డదారి గుండా వెళుతుండగా గంటల కొద్ది క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు తిరగబడ్డారు.

# హోరెత్తించిన జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు

## -కళలను ప్రోత్సహించేలా ప్రభుత్వం చొరవకు కళాకారుల ఫిదా






తిరుపతి(క్రీడ), నవంబర్ 21ప్రభాతవార్త:

ఆధ్యాత్మికనగరం తిరుపతి నగరంలో ప్రభుత్వం-భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు హోరెత్తించిన "జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు"కళాకారుల ఉత్సాహ ప్రదర్శనలతో సోమవారం సాయంత్రం ముగిశాయి. రాష్ట్రంలో జీవం కోల్పోతున్న కళలకు నూతన తేజం తీసుకువచ్చి, కళాకారులను ప్రోత్సహించేలా చేపట్టిన స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాల్లో వందలాదిమంది కళాకారులు పాల్గొని తమతమ సత్తాచాటారు. తిరుపతి మహతి కళాక్షేత్రం ఈ పండుగవాతావరణానికి వేదికైంది. రాష్ట్రపర్యాటకశాఖామంత్రి ఆర్కె రోజా సొంత జిల్లాలో స్వీయపర్యవేక్షణలో మూడురోజుల పాటు జరిగిన ఈ సంబరాలు శాస్త్రీయ, జానపద, లలిత సంగీత విభాగాల్లో, కూచిపూడి, భరత నాట్యం, ఆంధ్రనాట్యం, జానపద కళారూపాలైన ఉరుములు, చెక్కభజన, కోలాటం, లంబాడీ, కీలుగుర్రాలు, జానపదనృత్యాలు, పండరీభజన, వీధినాటకం, గురవయ్యలు, డప్పు బృందాలు మొదటిరోజు 1200మంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. రెండవరోజు 350మంది కళాకారులు పాల్గొనగా, చివరిరోజు సోమవారం 175మంది పాల్గొని తమ ప్రదర్శనలను ఆద్యంతం అద్భుతంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో పాల్గొన్న కళాకా రులకు ముఖ్యఅతిధులు ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, ఎంపి డాక్టర్ గురుమూర్తి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష, రాష్ట్ర సృజనాత్మకత ,సంస్కృతీసమితి ఛైర్మన్ వంగపండు ఉష, దర్శకుడు సెల్వమణి పాల్గొని ప్రదర్శనలో భాగస్వాములైన ప్రతి కళాకారునికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కాగా తిరుపతి తొలివేదిక కావడం, కళాకారులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించడంలో మంత్రిఆర్కె రోజా స్వయంగా పర్యవేక్షణ చేయడం పట్ల కళాకారులు ఆనందం వ్యక్తం చేశారు.

# ఎన్నికలకు సంసిద్ధంకండి : అమరనాథరెడ్డి

పలమనేరు, నవంబర్ 21,ప్రభాతవార్త:



ఎన్నికల వేడి మొదలైందని టిడిపి నాయకులు,కార్యకర్తలు ఎన్నికలకు సంసిద్ధం కావాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయిలోని మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు,క్లస్టర్,యూనిటీ ఇన్చార్జిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేడి మొదలైందని ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గుర్తించి వచ్చే ఎన్నికలలో గెలుపుకు కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం పని చేసే వారికే పార్టీ మొదటి ప్రాధాన్యత,గుర్తింపు ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 27న జిల్లాలో లోకేష్ పాదయాత్ర మొదలు కానుందని 15 రోజుల పాటు జిల్లాలో ఈ యాత్ర సాగబోతుందన్నారు. ఈ యాత్ర పూర్తయిన వెంటనే నియోజకవర్గం పైనే పూర్తి దృష్టి సారిస్తానని, బూత్, సెక్షన్ లెవల్ సభ్యులను ఏర్పాటు చేసుకొని గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామచంద్రనాయుడు, బ్రహ్మయ్య, చాంద్ బాషా, సుబ్రమణ్యం గౌడు, ఖాజా, మండల అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ, గిరిబాబు, నాగరాజు తదితరులు పల్గొన్నారు.

# పెద్దశేష వాహనంపై సిరులతల్లి

తిరుచానూరు, నవంబర్ 21 ప్రభాతవార్త:

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజైన సోమవారం ఉదయం ఏడు తలలు గల పెద్దశేష వాహనంపై శ్రీ వైకుంఠ నారాయణుడి అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్కభజనల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడవీధుల్లో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు వాహనసేవ సాగింది. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. వాహనసేవల్లో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, జేఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి, సూపరింటెండెంట్ మధు, ఆలయ ఇన్స్‌పెక్టర్లు దాము, ప్రసాద్, ఏవిఎస్ఓ శైలేంద్రబాబు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వైభవంగా జరిగింది.

### వేడుకగా స్నపన తిరుమంజనం

తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండ రోజైన సోమవారం అమ్మవారికి స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. మధ్యాహ్నం 12-30 నుండి 2-30 గంటల వరకు ఆలయంలోని శ్రీకృష్ణ స్వామి ముఖ మండపంలో కంకణభట్టర్ మణికంఠ బట్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఫల, పుష్పాలతో రూపొందించిన మండపంలో శ్రీపాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా ఈ వేడుక

### ఆకట్టుకున్న పుష్పాలంకరణః

ఆలయంలోని ధ్వజమండపం, గర్భాలయం, శ్రీకృష్ణ స్వామివారి ఆలయం, శ్రీ సుందరరాజ స్వామివారి ఆలయం, వాహన మండపం, టిటిడి గార్డెన్ విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. దాదాపు 70 మంది సిబ్బంది మూడు రోజుల పాటు శ్రమించి సుందరంగా అలంకరించారు.

# ముంబై ఫిలింఫెస్టివల్‌లో కుప్పం దర్శకుల సత్తా

## -రమేష్- గోపిలకు ఉత్తమ డైరెక్టర్ అవార్డు



కుప్పం, నవంబర్ 21 ప్రభాతవార్త

ముంబై ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ 2022లో ఉత్తమ దర్శకుడి కేటగిరీలో కుప్పంకు చెందిన సోదర ద్వయం రమేష్ గోపిలకు బెస్ట్ డైరెక్టర్ అవార్డు లభించింది. వీరు దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం యారిగె బేకు ఈ లోక అనే చిత్రానికి సంబంధించి ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో ఈ అవార్డును రమేష్‌గోపిలకు ప్రదానం చేశారు. కన్నడలో రమేష్ గోపి దర్శకత్వం వహించిన యారిగె బేకు ఈ లోక చిత్రంలో నటుడు ఆర్యవర్ధన్, కథానాయికలుగా వర్ష విశ్వనాథ్, ప్రియాంక రేవరి నటించారు. ఈ చిత్రం షూటింగ్ కుప్పం ప్రాంతంలో సైతం నిర్వహించారు. కాగా కుప్పంకు చెందిన రమేష్ గోపిలు దర్శకులుగా తొలిచిత్రాన్ని నటుడు తరుణ్‌తో ఇది నా లవ్‌స్టోరీ చేశారు. అనంతరం ఈ ఏడాది యువనటుడు రమణ్ కథా నాయకుడిగా రెడ్డిగారింట్లో రౌడీయిజం చిత్రానికి దర్శకత్వం వహించి విజయం సాధించారు. ప్రస్తుతం ఉత్తమ దర్శకులుగా కన్నడ చిత్రానికి అవార్డు అందుకోవడం పట్ల వీరిని కుప్పం స్థానికులు అభినందిస్తున్నారు.

# కోటలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కోట, నవంబర్ 21 ప్రభాతవార్త

మండల కేంద్రమైన కోటలో సోమవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా శివాలయంలో అర్చకులు తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన గ్రామోత్సవంలో పాల్గొన్నారు. సంప్రదాయాలను పాటిస్తూ అయ్యప్పస్వాములు గ్రామోత్సవం నిర్వహించడం అభినందనీయమని శ్యాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఆయన వెంట పాదర్తి రాధాకృష్ణారెడ్డి, దువ్వూరు సాయికృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ కండువాలేసుకున్న చిత్తూరు శంకర్ అనుచరులు

తిరుపతి, నవంబర్ 21ప్రభాతవార్త :



పిసిసి అధ్యక్షుడు శైలజానాథ్ సోమవారం మధ్యాహ్నం తిరుపతి పర్యటనలో వైసిపి తిరుపతి పార్లమెంట్ ఎస్సీ విభాగం జిల్లా కార్యదర్శి చిత్తూరు శంకర్ 30మంది అనుచరులతో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పిసిసి ఎస్సీవిభాగం కో ఛైర్మన్ గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో చిత్తూరుశంకర్, 30మంది అనుచరులకు స్వాగతం పలికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో డిసెంబర్‌లో ప్రజాచైతన్యపాదయాత్ర చేపట్టడానికి ముందు కార్యాచరణలో తిరుపతికి విచ్చేసిన శైలజనాథ్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

### మహిళా క్రీడాకారిణికి రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంత్రి రోజా ఆర్థిక సాయం

పుత్తూరురూరల్, నవంబరు 21 ప్రభాతవార్త:



మంత్రి రోజా పుత్తూరు మున్సిపాలిటీ నంది మంగళం గ్రామానికి చెందిన కుమారి, పావని అనే క్రీడాకారిణికి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. తిరుపతిలోని డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న పావని ఉత్తరప్రదేశ్‌లో నవంబరు 22న జరిగే జాతీయ క్రీడలకు, మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో డిసెంబరు 1వ తేదీ ప్రారంభమయ్యే రాక్ క్లైంబింగ్ ట్రెక్కింగ్ క్యాంప్‌కు ఎంపికయ్యారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రాధాన్యత ఇచ్చే మంత్రి రోజా పావని వినతి మేరకు ఈ శిబిరాలకు ప్రయాణం, వసతి, ప్రవేశ రుసుము, మెస్సింగ్, ఇన్‌సిడెంట్, ఇన్‌స్ట్రక్చర్ చార్జీలు, రైల్వే టికెట్లు నిమిత్తం 15 వేలు రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అందజేశారు.

# మత్స్యకార దినోత్సవం మరిచిపోయారా!



తడ, నవంబర్ 21 ప్రభాతవార్త

ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని అధికారులు మరిచిపోయారు. తడ మండలంలో గతంలో ఎన్నడూ ఇటువంటి సంఘటన చోటుచేసుకోలేదు. పులికాట్ సరస్సుపై ఆధారపడి ఆంధ్రా పరిధిలోని 17 కుప్పాల జాలర్లు జీవిస్తుండగా అందులో ఒక్క తడ మండలంలోనే 16 కుప్పాలు ఉన్నాయి. మండల పరిధిలో అత్యధిక జనాభా కలిగి ఉన్నారు. రాజకీయంగానూ వీరి ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. అయితే ఎన్నికల సమయంలో మాత్రం తమ ఓట్లను వలలో వేసుకునేందుకు నేతలు ప్రయత్నిస్తుంటారు తప్ప తమను గాలికొదిలేశారని సోమవారం పలువురు జాలర్లు గోడుమన్నారు. సోమవారం నిర్వహించాల్సిన మత్స్యకార దినోత్సవం పూర్తిగా నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్నప్పుడు ఇలా జరిగేది కాదని జాలర్ల సంక్షేమాన్ని తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించే వారని వారు చెప్పారు. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో పులికాట్ సరస్సు, బంగాళాఖాతం విస్తరించి తీరప్రాంతం కొత్తగా చేరింది. అయితే అప్పట్లో ఉన్న అధికారులు, ప్రస్తుతం ఉన్న అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో ఇప్పటికీ పులికాట్ మీద, జాలర్ల సమస్యల మీద శీతకన్ను వేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీనికితోడు అధికారులతో పాటు అధికార పార్టీ నాయకులు సైతం మత్స్యకార దినోత్సవాన్ని పట్టించుకోకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీలో ఇక్కడ ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారు. ఇక ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ నాయకులు జాలర్ల మీద తమకే పట్టుందని, మేమే జిల్లా, రాష్ట్ర నాయకులమని చెప్పుకుంటుంటారు. ఆ పార్టీ సైతం మత్స్య దినోత్సవాన్ని నిర్వహించలేకపోయింది. పులికాట్ జాలర్ల సంక్షేమ సంఘం, ఆంధ్రా, తమిళనాడు పులికాట్ జాలర్ల సంక్షేమ సంఘం 13 జిల్లాల ఉమ్మడి జాలర్ల సంఘం.. ఇలా ఎన్నో సంఘాల పేరుతో నేతలు కార్యకలాపాలు కొనసాగిస్తుంటారు కానీ తమ జీవనానికి ఆధారమైన మత్స్యకార దినోత్సవాన్ని వీళ్లెవరు పట్టించుకోలేదని కొంతమంది జాలరి యువకులు ఆందోళన వ్యక్తం చేశారు.

# ఓం శక్తి ఆలయాన్ని పరిరక్షించాలంటూ భక్తుల నిరసన

గంగవరం, నవంబరు 21, ప్రభాతవార్త :



ఓం శక్తి అమ్మవారి దేవాలయానికి తాళాలు వేయడం దుర్మార్గమని మా నవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ ప్రతినిధులు డివి మునిరత్నం, వేలాయుధం, రవికుమార్, పార్థసారథి పేర్కొన్నారు. మండలంలోని పలమనేరు, మదనపల్లె జాతీయ రహదారి పక్కన కూర్నిపల్లె క్రాస్ వద్ద 25 ఏళ్ళ క్రితం గంగవరం గ్రామానికి చెందిన మునీశ్వరమ్మ గుర్రప్ప దంపతులు దాతల సహకారంతో నిర్మించారు. అమ్మవారి విగ్రహంతో పాటు నాగళరాళ్ళను ప్రతిష్ఠింపజేశారు. ప్రతి రోజు పూజలు నిర్వహిస్తున్నారు. కాలక్రమేణ అమ్మవారి ఆశీస్సులతో భక్తుల కోర్కెలు పరిష్కారం అవుతుండడంతో రోజు రోజుకి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. పలమనేరుకు చెందిన భూమి యజమాని సుబ్బయ్యశెట్టి అతని కుమారుడు నాగరాజు ఆలయంలోనికి అక్రమంగా ప్రవేశించి ఆలయ ధర్మకర్త మునీశ్వరమ్మ, గుర్రప్పలపై దాడి చేసి ఆలయం నుండి వారిని గెంటివేసి ఆలయానికి తాళాలు వేయడంతో చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవారి ఆలయాన్ని పరిరక్షించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న గంగవరం ఎస్ఐ సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకొని ఆలయ విషయం కోర్టులో కేసు ఉన్నందున కోర్టుఉత్తర్వులు వచ్చేవరకు అమ్మవారి పూజలకు ఎవరు అడ్డంకులు సృష్టించకూడదని ఇరువురికి నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

# తుమ్మలగుంట, దుర్గసముద్రంలో అన్నదానాలు

తిరుపతిరూరల్, నవంబర్ 21 ప్రభాతవార్త:



అభిమాన నేత జన్మదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని తుమ్మలగుంట, దుర్గ సముద్రం గ్రామ పంచాయతీలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జీ పులివర్తి నాని జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట, దుర్గసముద్రం గ్రామ పంచాయతీలలో ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలు చేసారు. తుమ్మలగుంట పరిధిలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. దుర్గసముద్రంలో టిడిపి నేత, మాజీ ఎంపిటిసి సభ్యుడు మునిశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అక్షయ క్షేత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకముునుపు దుర్గసముద్రం చేరుకున్న నానికి బ్యాండ్ మేళంతో స్వాగతం పలికారు. బాణా సంచా పేల్చి, పూల చల్లుతూ అభిమాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, వేమూరు మధు, మధుశేఖర్, కత్తి సుధాకర్, బుద్దారెడ్డి, రవి, గోపాల్, కేశవులు శెట్టి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కేసులో చివరి నిందితుడు అరెస్టు

చిత్తూరు, నవంబర్ 21 ప్రభాతవార్త:

చిత్తూరు టుటౌన్ పరిధిలో డ్రగ్స్ కేసులో పరారీలో వున్న 9వ నిందితుడు సోమవారం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. ఈ మేరకు టుటౌన్ ఎస్ఐ మల్లికార్జున్ నిందితుడు సంతోష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెంగళూరు నుంచి చిత్తూరుకు డ్రగ్స్ తరలించి విస్తృతంగా అమ్మకాలు చేస్తుండటంతో ఇటీవల టుటౌన్ పోలీసులు ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఒక నిందితుడు పరారీలో వుండటంతో అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఈ కేసులో 9వ నిందితుడైన సంతోష్ సోమవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోవడంతో అతనిని అరెస్టు చేసి ఎస్ఐ మల్లికార్జున్ రిమాండ్‌కు తరలించారు.

# శ్రీవారిమెట్టు వద్ద టిటిడి వారి వనభోజన మహోత్సవం

చంద్రగిరి, నవంబర్ 21 ప్రభాతవార్త:



పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని శ్రీవారిమెట్టు మార్గంలోని పార్వేటి మండపం వద్ద సోమవారం టిటిడి ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు విశేష అలంకృతులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పార్వేటి మండపానికి తీసుకువచ్చారు. స్వామి అమ్మవార్లకు అర్చకుల స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, చందనంతో అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 1 గంట నుండి 3 గంటల వరకు కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, డిప్యూటీ ఈఓలు శాంతి, పార్వతీ, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, ఆలయ ప్రధానఅర్చకులు బాలాజీ రంగాచార్యుల, తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ విధానంలో ఏపిఎస్‌పిడిసిఎల్ ఇంటర్నల్ ఆడిట్

## -సంస్థ డైరెక్టర్ వివిఎన్.బాబు వెల్లడి

తిరుపతి ప్రెస్‌క్లబ్, నవంబర్ 21 ప్రభాతవార్త:



ఏపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని ఇంటర్నల్ ఆడిట్ విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్(ఫైనాన్స్) వివిఎన్.బాబు వెల్లడించారు. సోమవారం సంస్థ యొక్క కార్పొరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సంస్థ పరిధిలోని అకౌంట్స్ విభాగను అధికారులు, ఇంటర్నల్ ఆడిట్ అసిస్టెంట్లతో ఆయన టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ ఎన్‌విఎస్.సుబ్బరాజు, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ కె.శివప్రసాదరెడ్డిలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వివిఎన్.బాబు మాట్లాడుతూ మరో రెండు నెలల్లో ఇంటర్నల్ ఆడిట్ విధానాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. తద్వారా ఆడిటింగ్‌ను పారదర్శకంగా, త్వరతిగతిన పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం డైరెక్టర్ ఎన్‌విఎస్.సుబ్బరాజు మాట్లాడుతూ విద్యుత్ నష్టాలను తగ్గించడంలో ఆడిట్ విభాగం ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఆడిట్ విధానాన్ని ఆటోమేషన్ చేయడం ద్వారా ఆడిటింగ్ ప్రాసెస్ వేగవంతం అవుతుందని మరో డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు వై.లక్ష్మీనరసయ్య, కెఆర్ఎస్.ధర్మజ్ఞాని, జనరల్ మేనేజర్లు ఎం.రవి, డి.సురేంద్రరావు, పే ఆఫీసర్ గాయత్రీ భాయి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీకాంత్, అకౌంట్స్ ఆఫీసర్లు ప్రసన్నాంజనేయులు, నరేంద్ర, శ్రీధర్, లక్ష్మీనారాయణ, రామస్వామి, సంస్థ పరిధిలోని చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లా నుండి వచ్చిన ఆడిటర్లు, ఆడిట్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# శివాలయాల్లో ప్రత్యేక పూజలు





పుత్తూరురూరల్, నవంబరు 21 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణ , మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి రామలింగేశ్వరస్వామి మండల పరిధిలోని నేసనూరు, తురూరు, తిరుమలకుప్పం ఆలయాల్లో స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేశారు. అలాగే ఆలయాల ఆవరణలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పిండి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ఛైర్మన్ కొడగంటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు, ఆయనతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైసిపి పాలనలో ఎస్సీ, ఎస్టీ నిధులు దుర్వినియోగం

పుత్తూరు, నవంబరు 21 ప్రభాతవార్త :



వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టాల్సిన వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులను రద్దు చేసి వారికి తీవ్ర అన్యాయం చేసిందని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ విమర్శించారు. సోమవారం పుత్తూరు మునిసిపాలిటీ వినాయకపురం ఎస్టీ కాలనీలో ప్రజలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం పెట్టిన అనేక పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఒక్క రాయితీ రుణం మంజూరు చేయకుండా కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. నిబంధనల పేరుతో పెన్షన్లు, రేషన్ కార్డులు అకారణంగా తొలగిస్తూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ఇల్లు లేక ఎంతో మంది నిరుపేదలుంటే ఒక్క ఇంటి నిర్మాణం మంజూరు చేయలేదన్నారు. అనంతరం ఇటీవల శస్త్ర చికిత్స చేసుకున్న పుత్తూరు పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఇ.హేమాద్రిని పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, ఐటిడిపి సమన్వయకర్త ఈశ్వర్ యాదవ్, టిఎన్‌టియుసి నాయకులు జానకిరామయ్య, ధర్మయ్య, ఆనంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరుగో పరుగు

## - వార్త ప్రభావం

దొరవారిసత్రం, నవంబర్ 21 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో పక్షుల రక్షణపై 'కాపాడుతున్నారా.. మట్టిలో కప్పేస్తున్నారా' అనే కథనంతో 'వార్త' దినపత్రికలో ప్రచురితం కావడం తెలిసిందే. వార్త ప్రభావంతో సోమవారం స్థానిక వైల్డ్‌లైఫ్, ఫారెస్ట్ అధికారులు చనిపోయిన గూడబాతును నాయుడుపేటలోని పశుసంవర్ధక శాఖ ఆసుపత్రికి తరలించి అక్కడ అడిషనల్ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, దొరవారిసత్రం పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీదేవిల ఆధ్వర్యంలో పంచనామా చేశారు. నేలపట్టు పక్షుల కేంద్రంలో వలసపక్షుల కదలికను పరిశీలించని అధికారులు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### మారని అధికారుల పనితీరు

వలస పక్షులు, మూగజీవాలు వేర్వేరు కారణాలతో చనిపోతుంటే వెంటనే స్థానిక వైల్డ్‌లైఫ్ అధికారులు సంబంధిత అధికారులకు సమాచారం అందించాల్సి ఉంది. వలస పక్షుల మృతికి గల కారణాలను తెలుసుకోవాలి. అయితే గత కొంతకాలం నుంచి నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో అధికారులు ఇష్టంవచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై స్థానిక రేంజర్ ప్రసాద్‌ను వివరణ కోరగా, ఇప్పటివరకు విహంగాల మృతిపై తమకు సమాచారం లేదని చెప్పిన సమాధానం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. వాస్తవానికి నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి ఒక రేంజర్ ఆఫీసర్‌ను, మరికొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ అధికారులు పక్షుల రక్షిత కేంద్రానికి సమీపంలోనే నివాసం ఉండి విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఇక్కడి సిబ్బంది, రేంజర్ సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లూరు నుంచి నిత్యం రాకపోకలు కొనసాగించడంపై నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంపై ఎంత బాధ్యత ఉందో తెలుస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. దీనికితోడు సాయంత్రం వేళ గూటికి చేరిన వలసపక్షులు, జింకలు, ఇతర విదేశీ విహంగాలు తదితర వాటిని అప్పుడప్పుడు పరిశీలించాల్సి ఉంటుంది. కానీ రేంజర్ స్థానికంగా లేకపోవడం, ఎప్పుడూ నాలుగు గంటలు దాటిన తర్వాత పక్షుల కేంద్రంలో ఉన్నట్లు దాఖలాల్లేవని పలువురు ఆరోపిస్తున్నారు.



చనిపోయిన గూడబాతుకు పోస్టుమార్టం చేస్తున్న వైద్య సిబ్బంది